# సిగ్గు బొగ్గులయిందన్నయ్యా!

టి. డి. ప్రసాదరావు

"....నీవింకా పసివాడవు. ప్రపంచంలో తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. నీ వా పట్నంలో వంటిగా యెలాగున్నావో అని మీ అమ్మ చాలా యిదవుతుంది, వెళ్ళి నాలుగు నెలలయిందోలేదో చాలారోజులనుండి నిన్ను చూడలేదని కలవరపడుతుంది. బుద్ధొచ్చిన కుర్ర వాడవు, నేను మరేమీ వ్రాయ నవసరంలేదు, గాని అక్కడ చాలా జాగ్రత్తగా ఉండవలెను. పట్నంలో కనిపించే విషయాలు నీ లేత మన స్సును ఆకర్షించవచ్చును. జలషా స్నేహితులు జట్టుకట్టొచ్చు..... పెద్దక్కయ్యను జానకిని పండు క్కు రమ్మని వ్రాసాను. వీలుచూసుకొని నీవు కూడా శెలవుపెట్టి రావలెను."

మీసాలు గట్రా వత్తుగా వస్తున్నా మా నాన్న చిన్నతనం పోలేదనే మిషమీద బుద్ధులు వ్రాస్తు న్నాడు. ఇంతకూ నేను ఏమీ చెడి పాడైపో తానో అని ఆయన భయం. జానకి ఊసుకూడా ఎత్తుతున్నాడే. ఇతందా ఏదోపన్నాగం. ఉద్యోగం అయిందో లేదో పెళ్లిసరంజామా చేస్తున్నట్టుంది. ఏమిటో యిదంతా గొడబగా ఉంది. కాని ఏదో ఒకనాడు కావలసిందిగా. ఆయన ఉద్దేశమే జర గనీ. ఈ ఆలోచనలతో మెల్లగా మనుష్యులను తప్పించుకుంటూ పరాకుగా నడుస్తున్నా. మంద హాసంతో చేతిగుడ్డ పెదవులకు అదుముకొని నా యెదురుగా వస్తున్న గిరిజమీద పడ్డాయి కళ్లు. నేను మళ్ళీ వాస్తవిక జగత్తులో పడ్డాను. అయితే ఆవిడ్ని పలుకరిద్దామా వద్దా అన్న పెద్ద సమస్య వచ్చింది. మొన్న వాళ్లింటికి వాళ్లన్న శివరా వుతో వెళ్లినప్పుడు నాకావిడకాసి చూడడానికే సిగ్గే సింది. మొఖ మడ్డుపెట్టుకొని యేదో తప్పుచేసిన వాడిలా ఆమె కూచున్నవైపన్నా చూడకుండా ఫలహారం అది తడబడా చేసి పైకొచ్చేసాను. వెళిపోవస్తున్నప్పుడైనా గిరిజను చూడడానికి ధైర్యంలేకపోయింది. ఆవిడప్పుడే సమీపాని కొచ్చేస్తుంది. ఆమె నావైపు ఎవరో తెలిసిన మనిషివైపు చూసినట్టు చూస్తుందికూడాను. ఏమీ తోచలేదు. తలవకుండానే చిరునవ్వుతో నిలిచి పలుకరించాను :" మీ అన్నయ్య రాలేదా అండి" అని.

"ఓహో, మీరా, యింతదాకా నాతోనే వచ్చా డు. ఏదో పనుందని యీ ప్రక్కవీధిలోబడి వెళ్లాడు."

"పాపం. మీరు వంటరిగా యేం పనిమీద వెళుతున్నారో" అని తడబడుతూ అడిగాను. నాలోనాకే చాలా యిదిగా ఉంది, జంకులేకుండా ఆమెను చూస్తున్నాను. నిజంగా గిరిజ తాజా పువ్వులా ఉంది. నేను ఆవిడ ఎదురుగా నిలు చొని తదితర ప్రపంచాన్ని మరచిపోయి రెండు మాటలాడానో లేదో, అప్పుడే దారిపోయేవాళ్ల అనుమానపుకళ్లు పడుతూఉన్నాయి. వళ్లు సిమ సిమలాడుతూంది. గిరిజ, పాపం తబ్బిబ్బవుతూ ఉంది. నాకేమీ తోచడంలేదు. నమస్కారం పెట్టి నా దారిని పోదామంటే మనస్సు వప్పనూ లేదు. మళ్ళీ ప్రసంగం ఎలాగు మొదలుపెడదా మన్నా మాటలు తట్టనూలేదు. నా శక్తిహీనతను తెలుసుకుందిగాబోలు గిరిజే తిరుగుప్రశ్న వేసింది "మీరేపనిమీద వెళుతున్నారో ?" అని.

నాకు నిజంగా యేదైనా పనుంటేకదూ, ఫలానా పని అని చెప్పడానికి. "ఆ" అంటూ ప్రక్కకు చూచాను, ప్రక్కనున్న కాఫీహోటెలు మెట్లు యెక్కుతూ దిగుతూ ఉన్న స్త్రీ పురుషులు నా రక్షణకొచ్చారు. గభీమని స్ఫురించింది. "కాసిన్ని కాఫీనీళ్లు తాగుదామని" అని ఊరుకో కుండా సాహసించి "మీరుకూడా వస్తే చాలా ధన్యుడ్ని" అని నమలుతూ అతి ప్రయాసమీద అనేసాను.

గిరిజ కళ్లు మెరసాయి, కనుబొమలు కది లాయి, బుగ్గలు గులాబీలను కాసాయి, పెదవులు

చిరునవ్వులొలికాయి, నోట మల్లెలు విరిసాయి. నిజంగా గిరిజ ఒక దేవకాంతని కళ్లు భ్రమించాయి. గాని నా స్నేహితుడు శివరావు చెల్లెలని బుర్ర జ్ఞాపకం తెచ్చింది.

"ఆయ్యో. అదృష్టహీనురాలను. నేను మా అన్నయ్య యిప్పుడే సేవించాం...." చేయితో చూపబోయిందిగాబోలు దూరాన్నే ఉన్న పోలెలను. గాజులు గలగలలాడాయి. నా గుండె గజగజలాడింది. ఆ ధ్వనిలో యేదో వశీకరణశక్తి ఉంది. "మీరు త్రాగిరండి" అని ఆఖరుముక్క అనేసింది. ఇక కదలక వీలులేదని బలవంతాన "శెలవు" అంటూ కదలబోయాను.

"ఓహో! మూర్తీ". నేను గతుక్కుమన్నాను. శివరావు కంఠాన్ని విని వెనుక తిరిగి చూసాను. నరాలు వణుకుతున్నాయి. గుండెలో రాయి పడినట్టయింది. శివరావు యేమనుకుంటాడో, వంటిగా ఉన్న తన చెల్లిలతో సరసాలాడుతున్నాని అనుమానిస్తాడేమొ. నేను జబాబు చెప్పకుండానే అతనే అందుకున్నాడు "రావోయి మా యింటికి పోదా"మంటూ. సహృదయంతో ఆహ్వానిస్తూ. గిరిజవైపు నిశ్చలంగా చూసాడు. గిరిజ నావైపు అమాయకంగా అర్ధంలేని చూపు చూచింది. నాకు భయంపోలేదు సరికదా గిరిజవైపు చూడడానికి మళ్లీ సిగ్గడుతగుల్తుంది. ఆ పరిస్థితులలో యేమనాలోకూడా తెలియడంలేదు. అయోమయంగా ఉంది.

మనోహరంగా మెల్లగా ముగ్గురం నడుస్తున్నాము. పూర్వపుసిగ్గు మబ్బుతెరలాగు పూర్తిగా కప్పేసింది. గిరిజవైపు చూడనేలేదు మరి. నోటివెంట మాటకూడా రాలేదు. మాలో మా నిశ్శబ్దాన్ని బద్దలుచేస్తూ శివరావు అన్నాడు: "నీకేమిటోయి యింత వల్లమాలిన సిగ్గు. ఆవాళకూడా దించిన బుర్ర యెత్తకుండా పెళ్లికూతురులా ఆలా వెళిపోయావు" అన్నాడు.

గిరిజ పకపక నవ్వబోయి ముసిముసినవ్వుతో ఆగిపోయింది. లేకపోతే నేను యింకా సిగ్గుపడతానవికాబోలు. శివరావుమాత్రం విచ్చలవిడిగా నవ్వేసాడు అతనన్నమాటలకు అతనే. నాకు కొంచెం పౌరుషం వచ్చింది. మళ్లీ యేమనాలో తెలియక దాన్ని చంపుకున్నాను. పైకిమాత్రం చిన్న చిరునవ్వుమాత్రం చూపాను.

వయ్యారంగా నడుస్తున్న గిరిజ వంగి పూలగంపను తిలకించి తిరిగి మావైపు చూచింది. "ఏమి గిరిజా పూలు కావాలా" అంటూ ముందడుగువేసి బేరంలో దిగాను పూలమనిషితో. శివరావు నన్ను పరీక్షిస్తున్నాడుగాబోలు, ఏమీ అనకుండా. వారుగా గిరిజ చూస్తుంది. పూవులను కొని గిరిజకు అందించాను. ఆమె యెంతో చనువుగా పూవులను అందుకొని కొప్పులో సవరించుకుంటూంది.

"ఏమోయి సిగ్గు వదలిపోయిందా ఏమిటి అంత యిదిగా యెంతో పరిచయం ఉన్నవాడిలాగు ప్రవర్తిస్తున్నావు" అని అన్నాడు నవ్వుమొగముతో శివరావు. నేను జబాబు చెప్పకముందే, మా యిద్దరిమధ్యను నడుస్తున్న గిరిజ కోకిల కంఠంతో "ఆయన సిగ్గుబొగ్గులయిందన్నయ్య" అంది. "అవునోయి" అన్నాను నవ్వుతూ. శివరావూ నవ్వేశాడు.


# కృష్ణవేణి సిరాలు




ఉల్లమలరఁ జేయు నల్లఁదనమునందు.
పరుగు తరుగు లేని పాటుఁదలను,
ఎదకు నింపుఁగూర్చు కృష్ణవేణిసిరాలు
పొదలు కృష్ణవేణి నదిని బోలి.

మద్రాసు, దక్షిణజిల్లాలకు డిస్ట్రిబ్యూటరు:
సి. ఆర్. తిరుమల్ పాడ్,
141, గోవిందప్పనాయకన్ వీధి, మద్రాసు 1.